సాక్షి
బాపట్ల
మంగళవారం, 22, ఏప్రిల్, 2025



శీతలాంబ ఆలయ వార్షికోత్సవం


ఫిరంగిపురం:వేమవరంలో శీతలాంబ ఆలయం 34వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



దేవస్థానం వార్షికోత్సవం

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

27న చండీ హోమం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో 27న అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ కె. సునీల్ కుమార్ తెలిపారు.

న్యూస్‌రీల్

గుంటూరు జిల్లా జడ్జిగా కల్యాణ్ చక్రవర్తి బాధ్యతల స్వీకారం



గుంటూరు లీగల్ : జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బి.కల్యాణ్ చక్రవర్తిని సోమవారం జిల్లా ప్రెసిడెంట్ తుబాటి శ్రీను, ప్రధానకార్యదర్శి పి.శ్రీనివాసరావు, టౌన్ ప్రెసిడెంట్ లక్ష్మనాయక్ మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ నవీన్, స్టేట్ జనరల్ సెక్రటరీ పి.రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ బ్రహ్మయ్య, శేషగిరి, హరిబాబు, ఖాజా, కల్యాణి, సాయి అభిజిత్, శివారెడ్డి పాల్గొన్నారు.

చైల్డ్ ఫ్రెండ్లీ కోర్ట్ జడ్జిగా షమీ పర్వీన్ సుల్తానా

గుంటూరులీగల్: జిల్లా కోర్టులో చైల్డ్ ఫ్రెండ్లీ కోర్ట్ (పోక్సో) జడ్జిగా షమీ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగళశెట్టి సూర్యనారాయణ, జనరల్ సెక్రెటరీ మోతుకూరి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రామకోటిరెడ్డి, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఒరిగిన రామలింగేశ్వర ఆలయ శిఖరం



అమరావతి: అమరావతిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు రామేశ్వరం యాత్రకు వెళ్లి, గుర్తుగా రామలింగేశ్వర విగ్రహం తీసుకొచ్చి ప్రతిష్ఠించి, స్థానికంగా ఆలయ నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ఆలయంలోని రామలింగేశ్వరునికి నిత్య పూజలు జరుగుతున్నాయి. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయం ఏళ్లతరబడి ఆదరణ లేక నిర్లక్ష్యానికి గురైంది. ఈక్రమంలో ఇటీవల గాలివానకు ఆలయ విమాన శిఖరం ఒరిగి వేలాడుతోంది. ఆలయ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆలయ శిఖరానికి దూరం నుంచి నమస్కారం చేసుకుంటే స్వామి వారికి నమస్కరించినట్లేనని భక్తుల నమ్మకం. అటువంటి శిఖరానికి అపచారం జరిగినా పట్టించుకోని దేవాలయ అధికారులపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి విస్తరణ సలహా మండలి సమావేశాలు

గుంటూరురూరల్:నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో 2024–25 ఏడాదికిగానూ కృష్ణ మండలం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు లాంఫాం ఏడీఆర్ డాక్టర్ దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో రెండు రోజులపాటు సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గత ఏడాది కార్యాచరణ, సలహాల మేరకు చేపట్టిన కార్యక్రమాలు, ప్రగతి, రానున్న ఏడాది నిర్వహించే కార్యక్రమాలు, పరిశోధన, విస్తరణపై చర్చలు జరుగుతాయన్నారు. రైతులు, శాస్త్రవేత్తలు, సలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొంటారన్నారు.

ఘనంగా సివిల్ సర్వీసెస్ డే



నరసరావుపేట: సివిల్ సర్వీసెస్ డేను పురస్కరించుకొని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జేసీ గనోరే సూరజ్ ధనుంజయలను అధికారులు సత్కరించారు. సోమవారం టౌన్ హాలులో వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా, డివిజన్‌స్థాయిఅధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు పోలీస్ సిబ్బంది

మంగళగిరిటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని పలు స్కూళ్లు, కాలేజీలను సోమవారం సిబ్బందితో కలసి సందర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ మే 2న ప్రధాని మోదీ రాజధాని అమరావతికి రానున్న నేపథ్యంలో ఆరువేల మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తుకు రానున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, కల్యాణ మండపాలలో మూడు రోజుల ముందు నుంచే సిబ్బంది ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు.

నిబంధనల మేరకే

లే అవుట్‌ల క్రమబద్ధీకరణ

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల లే అవుట్‌ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో బాపట్ల మున్సిపాలిటీ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్‌లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 2019 నుంచి మున్సిపాలిటీ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్లను గుర్తించాలని అన్నారు. మున్సిపాలిటీ, బావుడా పరిధిలోని తొమ్మిది మండలాలలో మొత్తం 183 లే అవుట్లను గుర్తించి వాటి వివరాలను డీటీసీపీకి పంపినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. వివరాలను పత్రికలలో ప్రచురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు వివరించారు. అందులో 86 లే అవుట్లను 22–ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కు పంపినట్లు తెలిపారు. మిగిలిన లే అవుట్లను సబ్ డివిజన్లుగా చేసి పంపాలని వాటిని తిప్పి పంపారని వారు కలెక్టర్‌కు వివరించారు. 183 లే అవుట్ల క్రమబద్ధీకరణకు సాధ్యాసాధ్యాలపై జిల్లా కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. కొత్త లేఅవుట్ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ల్యాండ్ కన్వర్షన్‌కు, ఇంటి నిర్మాణాలకు సంబంధించి మునిసిపాలిటీ, బావుడా, పంచాయతీ పరిధిలోని నిబంధనలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఆలస్యం అవుతుందని, తద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి తగ్గుతుందని, బాపట్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, వాటిని వీలైనంత త్వరలో నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి గంగాధర్‌గౌడ్, డీపీఓ ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, బావుడా ప్లానింగ్ అధికారి షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- చీరాల మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో గిరిజన ప్రజలు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి మూడో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చీరాల నియోజకవర్గంలో భూములకు సంబంధించి ఇంటి స్థలాలు, గృహ నిర్మాణాలు, పెన్షన్ల గురించి, పోలీస్‌శాఖకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయన్నారు. వాడరేవు పంచాయతీ సిద్ధార్ కాలనీలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను ప్రభుత్వం పూర్తి చేయాలని ప్రజలు కోరారన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు పరిశీలించి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చీరాల వైకుంఠపురం గేటు వద్ద గల శ్మశానస్థలంలో కొంత మంది గిరిజనులు నివాసం ఉంటున్నారని, వారికి గృహ నిర్మాణ సదుపాయా లు కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ చీరాల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమానికి జిల్లా అధికారులు రావడం వలన సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. నియోజకవర్గంలో ఖాళీ భూములను గుర్తించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చీరాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, డీఎంహెచ్ఓ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్లు గోపీకృష్ణ, పార్వతి పాల్గొన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

అధికారులకు ఎంపీ తెన్నేటి ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీ కృష్ణ ప్రసాద్

చీరాలటౌన్: జిల్లా పరిధిలో నిర్మాణం చేస్తున్న జాతీయ రహదారుల పనులను నాణ్యంగా, త్వరగా పూర్తి చేయాలని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆదేశించారు. సోమవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్యతో కలిసి ఎంపీ జాతీయ రహదారులపై సంబంధిత శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటి అధికారులు విధులు సమర్థంగా నిర్వర్తించి జాతీయ రహదారి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. వివిధ జిల్లాలను కలుపుతూ నిర్మాణం చేస్తున్న 167–ఏ వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారి పనులు సకాలంలో పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. 216 రహదారిలో గుంతలు లేకుండా చూడాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారిలో కొంతమందికి నష్టపరిహారం సక్రమంగా రాలేదని ఫిర్యాదులు వచ్చాయని వాటిని త్వరగా పరిష్కరించి నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. నాణ్యతలో రాజీలేకుండా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో టి.చంద్రశేఖర నాయుడు, తహసీల్దార్లు గోపికృష్ణ, పార్వతి, నేషనల్ హైవే అథారిటి అధికారులు పాల్గొన్నారు.



వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ వేటపాలెంలో ముస్లింలు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ, నల్ల జెండాలు చేబూని ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. -వేటపాలెం

భళా.. రామకృష్ణ విద్యా తృష్ణ

- 58 ఏళ్ల వయస్సులో కార్డియాలజీ పీజీ పూర్తి చేసిన గుంటూరు వైద్యుడు
- గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుదైన రికార్డు
- నాలుగు పీజీలు పూర్తి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాజుల రామకృష్ణ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. సోమవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన పీజీ సూపర్ స్పెషాలిటీ పరీక్ష ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణత సాధించారు. కార్డియాలజీలో పీజీ పూర్తి చేసి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా నాలుగు పీజీ వైద్య విద్యలు జనరల్ మెడిసిన్, పల్మనరీ మెడిసిన్, న్యూరాలజీ, కార్డియాలజీ అభ్యసించారు. ఇన్‌ఫెక్షన్ డిసీజెస్, డయాబెటాలజీలో డిప్లొమో కోర్సులు పూర్తి చేశారు.

చావలి వాస్తవ్యులు

గుంటూరు జిల్లా వేమూరు మండలం చావలికి చెందిన గాజుల వీరశేఖరరావు, లీలావతి దంపతుల కుమారుడు రామకృష్ణ గుంటూరు ఎల్ఈఎం స్కూల్‌లో 7వ తరగతి వరకు చదివారు. బాలకుటీర్ స్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు, గుంటూరు జేకేజీ కళాశాలలో ఇంటర్ అభ్యసించారు. గుంటూరు వైద్య కళాశాలలో 1986 - 92లో ఎంబీబీఎస్, 1998-2000లో పల్మనాలజీలో పీజీ చేశారు. 2001 నుంచి 2004 వరకు వెల్దుర్తి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. 2004 నుంచి 2006 వరకు ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రిలో ట్యూటర్‌గా పని చేశారు. 2006 నుంచి 2009 వరకు జనరల్ మెడిసిన్‌లో గుంటూరులో పీజీ అభ్యసించారు. 2009 నుంచి 2011 వరకు గుంటూరు జీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2011 నుంచి 2014 వరకు తిరుపతి సిమ్స్‌లో న్యూరాలజీలో పీజీ వైద్య విద్యను అభ్యసించారు. 2014 నుంచి నేటి వరకు గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ 2022లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. పీజీ నీట్ ఎంట్రన్స్‌లో ర్యాంకు సాధించి కార్డియాలజీ సూపర్‌స్పెషాలిటీ పీజీలో మంగళగిరి ఎన్నారైలో చేరారు. నేడు విజయవంతంగా కార్డియాలజీ పీజీ కోర్సు పూర్తి చేసుకుని, నాలుగు పీజీలు చదివిన ఏకైక వైద్యుడిగా అరుదైన రికార్డు డాక్టర్ రామకృష్ణ సొంతం చేసుకున్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ

తిరుపతిలో పీజీ వైద్య విద్యార్థిగా ఉన్న సమయంలో డాక్టర్ గాజుల రామకృష్ణ 86 స్పోర్ట్స్ మెడల్స్ దక్కించుకున్నారు. 33 న్యూరాలజీ క్విజ్ పోటీల్లో విజేతగా నిలిచి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. 2014లో నేషనల్ క్విజ్ పోటీలో విన్నర్‌గా నిలిచారు.

నేడు కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల



కొండపాటూరు(కాకుమాను): భక్తుల కొంగు బంగారమైన కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మంగళవారం జరగనుంది. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.

ప్రధాన ఘట్టం శిడిమాను మహోత్సవం

ఒక పెద్ద దులానికి చివరి భాగాన ఇనుప బోనును ఏర్పాటు చేస్తారు. అందులో మేకపోతును ఉంచి సాయంత్రం ఆరు గంటల సమయంలో గ్రామ పుర వీధులలో మేళతాళాలు, కనక తప్పెట్ల మధ్య ఊరేగిస్తారు. శిడిమాను బయలుదేరే ముందు శిడి పెద్ది కొడుకుని ప్రత్యేకంగా అలంకరించి, దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ పురవీధుల్లో తిప్పుతారు. దీంతో శిడిమాను బయలు దేరేందుకు సిద్ధమైందని గ్రామస్తులంతా దేవాలయం వద్దకు చేరుకుంటారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు శిడిమానును ఏర్పాటు చేశారు. ఆ పెద్ద దూలానికి రైతులు పండించిన వివిధ రకాల పంటలను కట్టి, చల్లంగా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నారు. తిరునాళ్లలో వినోదం అందిచేందుకు రంగుల రాట్నాలు, జెయింట్ వీల్‌లను ఏర్పాటు చేశారు. చిన్నారులకు ఆట వస్తువులు, గృహోపకరణాల దుకాణాలు ఏర్పాటు చేశారు.

సోషల్ మీడియా కన్వీనర్‌పై

టీడీపీ సానుభూతిపరుల దాడి



బల్లికురవ: బల్లికురవ మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొండవద్దు గోపీరాజు యాదవ్‌పై టీడీపీ సానుభూతిపరులు పథకం ప్రకారం దాడి చేశారు. కర్రలతో కొట్టి గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఉప్పమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడులో రామాలయం వద్ద శ్రీరామనవమి పదహారు రోజుల పండుగ వేడుకల్లో పాల్గొనేందుకు గోపిరాజు యాదవ్ గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామానికి వచ్చిన గోపిరాజును కొట్టాలని పథకం వేసుకున్న టీడీపీ సానుభూతిపరులు చావలి నాగేశ్వరరావు, సురేశ్, వెంకటేశ్, రాజమోహన్‌లు కర్రలతో దాడి చేశారు. దాంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, క్షతగాత్రుడిని హుటాహుటిన గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. క్షతగాత్రుడిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు పరామర్శించారు. కృష్ణబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై టీడీపీ సానుభూతిపరులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పండుగ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన యువకునిపై కక్ష కట్టి దాడిచేశారన్నారు. గతంలోనూ ఇదే విధంగా అతనిపై దాడి చేశారని చెప్పారు. ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక పోలీసులు సైతం నిందితులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అధికారులు పక్షపాత వైఖరి విడనాడాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యతతో జీవించేలా చూడాలన్నారు.

వేగవంతంగా మాదిపాడు బ్రిడ్జి నిర్మాణం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన
- 13.45 ఎకరాలు భూసేకరణ చేసి రూ.60.50 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం



మాదిపాడు వద్ద కృష్ణానదిపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

అచ్చంపేట: మండల సరిహద్దులోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై వంతెన నిర్మాణ ఆవశ్యకతను గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభ్యర్థన మేరకు 2023 జూన్ 12న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మాదిపాడు నుంచి ముక్త్యాలవరకు కృష్ణానదిపై 600 మీటర్ల పొడవు, 12మీటర్ల వెడల్పు, 14 పిల్లర్లతో వంతెన నిర్మాణం చేపట్టవలసి ఉంది. ప్రస్తుతం కృష్ణానదిలో రెండు పిల్లర్లకు అవసరమైన ఐరన్ బిగించి, బీములను భూమి లెవెల్ వరకు పోశారు.

బ్రిడ్జి నిర్మాణానికి 13.45 ఎకరాల భూ సేకరణ

వంతెనకు సంబంధించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే 13.45 ఎకరాల భూమిని సేకరించారు. ఇందుకుగాను రూ.60.50 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించారు. పల్నాడు జిల్లా మాదిపాడు వైపు 4.45 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాలవైపు 9 ఎకరాల భూమిని సేకరించారు. బ్రిడ్జి పొడవు 450మీటర్లు కాగా, వెడల్పు 12మీటర్లు. ముక్త్యాలవైపు కిలోమీటరు, మాదిపాడు వైపు అరకిలోమీటరు రోడ్డు వేయనున్నారు. కృష్ణానదిపై 14 పిల్లర్లతో బ్రిడ్జి నిర్మాణం జరగనుంది.

బ్రిడ్జి నిర్మాణం ఆగదు

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
- నష్టపరిహారం తీసుకుని సహకరిస్తే మంచిది
- స్టేటస్‌కో ఇచ్చిన బిల్డింగ్‌ను కౌన్సిల్‌లో పెట్టి డిస్పోజ్ చేస్తాం

నెహ్రూనగర్: ''శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ విషయంలో ఒక్క బిల్డింగ్ యజమానికి మాత్రమే స్టేటస్ కో ఉంది. దాన్ని వదిలేస్తాం.. దిష్టిబొమ్మలాగా ఉంటుంది.. వారం రోజుల్లో కౌన్సిల్‌లో పెట్టి డిస్పోజ్ చేస్తాం.. అంతదూరం అవసరమా ?'' అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ప్రభావితమయ్యే భవన యజమానులపై ఆయన ఈ విధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. సోమవారం 191 భవన యజమానుల్లో ప్రస్తుతం 21 మందికి మాత్రమే నష్టపరిహారం కింద చెక్కులను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ''బ్రిడ్జి నిర్మాణం ఆగదు.. మీరు ఎంత తొందరగా నష్టపరిహారం తీసుకుని సహకరిస్తే అంత మంచిది.. నిర్మాణాన్ని అడ్డుకుంటే చరిత్రహీనులవుతారు.. 51 మంది కోర్టుకు వెళ్లారు.. 44 మంది ప్రొసీజర్ ప్రకారం ఫాలో అవుతామని చెప్పారు.. ప్రొసీజర్ ప్రకారం డబ్బు డిపాజిట్ చేస్తాం..పొక్లెయిన్స్ వచ్చేస్తాయి.. అది అవసరమా?'' అన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పలువురు భవన యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

24న ఉమ్మడి గుంటూరు జిల్లా బీచ్ కబడ్డీ సెలక్షన్స్

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళల 12వ బీచ్ కబడ్డీ సెలక్షన్స్ ఈనెల 24వ తేదీన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకుని రావాలని సూచించారు. సెలక్షన్స్ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు.

యార్డుకు 1,49,133 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): స్థానిక మార్కెట్ యార్డుకు సోమవారం 1,49,133 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,42,976 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,400 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,568 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు సోమవారం 115 బస్తాలు వచ్చాయని, మొత్తం అమ్మినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 55 బస్తాలు వచ్చాయని, వాటి కనిష్ఠ ధర రూ.11,350, గరిష్ఠ ధర రూ.11,350, మోడల్ ధర రూ.11,350 పలికిందని పేర్కొన్నారు. కాయలు 60 బస్తాలు వచ్చాయని, వాటి కనిష్ఠ ధర రూ.11,350, గరిష్ఠ ధర రూ.12,400, మోడల్ ధర రూ.11,350 లభించినట్లు తెలియజేశారు. మొత్తం 86.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

- చీరాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10.2 కోట్లు
- పేరాల, మసీదు సెంటర్లలో ట్రాఫిక్ నియంత్రించాలి
- నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

చీరాల: చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని, బీచ్‌లను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, పర్యాటక ప్రాంతం అభివృద్ధిపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చీరాలలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.10.2 కోట్ల నిధులతో జలజీవన్ మిషన్ కింద పనులు చేపడతామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరా కోసం రూ.60 లక్షలు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మంజూరు చేస్తామన్నారు. చీరాల పరిధిలోని ఐదు ఎత్తిపోతల పథకాల మరమ్మతులు చేయడానికి యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8.25 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు కేటాయింపులు జరగగా అదనంగా మరో రూ.1.75 కోట్ల నిధులు వెచ్చిస్తామన్నారు. డీఎఫ్‌ఎం కింద మరో రూ.2 కోట్లు నిధులు బీచ్‌ల అభివృద్ధికి మంజూరు చేస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.50 కోట్లతో చీరాల పట్టణంలో మురికినీటి వ్యవస్థ అభివృద్ధికి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. రూ.150 కోట్లతో చీరాలలో ఫిషింగ్ హార్బర్ నిర్మించడానికి తయారుచేసిన డీపీఆర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించాలన్నారు. చీరాల వాడరేవు, రామాపురం బీచ్‌లలో బయో టాయిలెట్స్ నిర్మిస్తామన్నారు. పర్యాటక రంగంగా మారనున్న బీచ్‌ల వద్ద రక్షణ చర్యలు పెంచాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైల్వే ట్రాక్‌పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మసీదు సెంటర్, పేరాల రైల్వేగేటు వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. అభివృద్ధి పనులు వేగంగా చేపట్టడానికి కొన్నింటికి ప్రతిపాదనలు, మరికొన్నింటికి టెండర్లు పిలవాలన్నారు. పనుల్లో జాప్యం వద్దని అధికారులకు సూచించారు. ప్రతి నెలా రెండు రోజులు నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో మురుగు నీటి వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాల్‌మనీ తరహాలో వడ్డీ వ్యాపారులు ప్రజల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారన్నారు. ఇంటి స్థలాలు లేక పేదలు కాలువ కట్టలపై ఉంటున్నారన్నారు. విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించాలన్నారు. చీరాల నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి జరిగేలా సహకరించాలని ఆయన కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, ఆర్డీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ తుషార్ డూడీ
- పీజీఆర్‌ఎస్‌లో 71 అర్జీలు స్వీకరణ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు ఎస్పీని కలసి తమ సమస్యలు ఏకరవు పెట్టారు. బాధితుల సమస్యలు తెలుసుకుని, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులు అత్యంత ప్రాధాన్యతతో చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్లకు, కార్యాలయాలకు వచ్చినప్పుడు వారి పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి ఫిర్యాదులకు ముఖ్య ప్రాధాన్యతనిచ్చి, చట్ట పరిధిలో విచారించి బాధితులకు తగిన న్యాయం చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్దీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో జాప్యత వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగంతో శ్రమ,ఖర్చు ఆదా

జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

బాపట్ల: వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగంతో రైతులకు శ్రమ తగ్గటంతోపాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగంపై సోమవారం గ్రూప్ కన్వీనర్, కో కన్వీనర్లకు బ్యాంకు అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ డ్రోన్ యంత్ర పరికరాల ఖరీదు కూడా 80 శాతం సబ్సిడీతో రైతు గ్రూపులకు అందించేందుకు కొన్ని కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. డ్రోన్ ఉపయోగించటం వలన ఖచ్చితత్వం ఆధారంగా మందుల వినియోగం కూడా 20 నుంచి 25 శాతం ఆదా అవుతుందని తెలిపారు. సమావేశంలో అధికారులు బి.ప్రకాశ్‌రావు, దిబోరా, వివిధ కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులను ఆపేయాలి

కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసిన ప్రజాసంఘాల ఐక్యవేదిక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

చీరాల రూరల్: కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై చేస్తున్న దాడులను ఆపేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీనియర్స్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర చేనేత జనసమాఖ్య నాయకులు మాచర్ల మోహనరావు, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మ, బీసీ ఫెడరేషన్ నాయకుడు ఊటుకూరి వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె హరిహరరావు, పౌరహక్కుల సంఘం నాయకుడు బడుగు విమలాకర్‌లు మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. మధ్య భారతదేశం అయిన ఛత్తీస్‌ఘడ్, ఝూర్కండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలోని సహజవనరులైన ఖనిజ సంపదను భవిష్యత్ తరాలకు అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుకోవడం కోసం ఆదివాసీలు అడవులను, అడవుల్లోని ఖనిజ సంపదను కాపాడుతుంటే కేంద్ర ప్రభుత్వం కొన్ని బహుళజాతి కంపెనీలకు ఆయా సంపదలను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నది వారు ఆరోపించారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలను, సైన్యాన్ని ఉపయోగించి మావోయిస్టులను ఏరివేస్తున్నట్లు నటిస్తూ అడవులలో జీవిస్తున్న ఆదివాసీలపై దాడులు చేయిస్తుందని విమర్శించారు. ఆదివాసీలకు ప్రత్యేకంగా ఉన్న రాజ్యాంగంలోని షెడ్యూల్ 5లోని షెడ్యూల్ కుమాలు, షెడ్యూలు ప్రాంతాలు రక్షణ చట్టం, ఫారెస్టు హక్కుల చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం వంటి హక్కులను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను కాలరాస్తు ఆదివాసీలను అడవులలో ఉండకుండా దూరం చేస్తుందని ఆరోపించారు. గత 18 నెలలుగా మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను హననం చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులతో ప్రమాదమని కేంద్రం భావిస్తే వారితో చర్చలు జరిపి పరిష్కార దిశగా ఆలోచించాలి కానీ ఈవిధమైన ఘోరాలకు పాల్పడడం మంచిదికాదని వారు హితవు పలికారు. ఈ విషయమై మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజలతో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

అదుపు తప్పిన ట్రాక్టర్ బోల్తా..



కారంచేడు–చీరాల రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్, చెల్లాచెదురుగా పడిన శనగకాయలు

కారంచేడు: అధిక లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాకచక్యంతో తప్పించుకోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కానీ పెనుప్రమాదం తప్పిందనే చెప్పాలి. సోమవారం ఉదయం వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలోని కారంచేడు–చీరాల మధ్యన జరిగిన ఈ ప్రమాదంలో చీరాల వైపు నుంచి పర్చూరు వైపునకు వేరుశనగ కాయల లోడుతో వేగంగా వస్తున్న ఈ ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో రోడ్డుపై వేరుశనగ కాయల బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. రోడ్డుపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలచిపోయింది. స్థానిక ఎస్‌ఐ వీ వెంకట్రావు సంఘటనా స్థలానికి తన సిబ్బందిని పంపి ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ప్రమాదం సమయంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు రాకపోవడంతోపాటు, కాలువ వైపు కాకుండా మరోక వైపు పడిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. అధిక లోడు కారణంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని చెబుతున్నారు.

జాతీయ రహదారిపై తిరగబడ్డ కారు

ఇరువురికి గాయాలు



జాతీయ రహదారిపై ప్రమాదంలో తిరగబడ్డ కారు

జె.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన ఘటనలో ఇరువురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు నుంచి బిహార్ వెళుతున్న టీఎస్ 73 ఏసీ 5344 నంబరు గల కారు ముందు టైరు పంక్చర్ కావడంతో రోడ్డు మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మలను ఢీకొని బోల్తా పడింది. సోమవారం అలవలపాడు అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ సంఘటనలో కారు నడుపుతున్న జీ మురళీధరన్ (వేలూరు)తోపాటు అందులో ప్రయాణిస్తున్న శశికళ అనే మహిళకు గాయాలయ్యాయి. సమాచార తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. రోడ్డుపై పడిపోయిన కారును మార్జిన్‌లోకి తరలించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన శంకరరావు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన జంపు శంకరరావు (55) ఈనెల 10వ తేదీన ముప్పవరం గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పంగులూరు గ్రామానికి చెందిన జంపు శంకరరావు మార్టూరు కూరగాయాల మార్కెట్‌లో రోజువారి కూలీగా పనిచేస్తూ జీవనం సాగుస్తుంటాడు. రోజు మాదిరిగానే ఈనెల 10వ తేదీ మార్టురు మార్కెట్ కూలి పనికి వెళ్లి పని ముగించుకొని తిరిగి వస్తున్నాడు. ముప్పవరం వచ్చే సరికి జాతీయ రహదారిపై బైక్‌పై వస్తున్న శంకరరావును గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. సోమవారం మృతి చెందగా మృతదేహాన్ని పంగులూరు స్వగ్రామం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

బాపట్లటౌన్: పట్టణంలోని సన్ అండ్ శాండ్ బార్ సమీపంలో సూర్యలంక రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. మృతుడు వైలెట్ కలర్ చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చినగంజాం: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఉరేసుకొని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాజు బంగారుపాలెం పొలాల్లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శీలం రమేష్ అందించిన సమాచారం ప్రకారం... మండలంలోని రాజుబంగారుపాలెం రైల్వేగేటు పక్కన ఉన్న పొలాల్లో ఉన్న పూరిగుడిసెలో ఉండే గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని చనిపోయినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. చనిపోయి రెండు మూడు రోజులు కావడంతో శవం గుర్తుపట్టని లేని విధంగా తయారైందని, సమాచారం తెలిసిన వారు చినగంజాం ఎస్‌ఐ రమేష్ 9121102149, ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య 9121102147కు తెలియజేయాలని సూచించారు.

హెల్త్ యూనివర్సిటీ టాపర్‌గా గుంటూరు వైద్యుడు



డాక్టర్ కార్తిక్‌రెడ్డి, డాక్టర్ అజ్మ, డాక్టర్ కాంతిమాలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో పీజీ తృతీయ సంవత్సరం చదువుతున్న డాక్టర్ పప్పిరెడ్డి కార్తిక్ రెడ్డి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సోమవారం ప్రకటించిన పీజీ సూపర్ స్పెషాలిటీ పరీక్ష ఫలితాల్లో టాపర్‌గా నిలిచాడు. డీఎం న్యూరాలజీ పరీక్ష ఫలితాల్లో 800 మార్కులకు గాను 649 సాధించి హెల్త్ యూనివర్సిటీలో ప్రథమ స్థానం సాధించాడు. ద్వితీయ, తృతీయ స్థానం కూడా గుంటూరు జీజీహెచ్ వైద్యులే సాధించి రికార్డు సృష్టించారు. డాక్టర్ అజ్మ హెల్త్ యూనివర్సిటీ సెకండ్ టాపర్‌గా, డాక్టర్ కాంతిమాల థర్డ్ టాపర్‌గా నిలిచి గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగ ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో మారుమోగేలా చేశారు.

స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ ప్రదానం

యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన డాక్టర్ కార్తిక్‌రెడ్డికి హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం రోజు గోల్డ్‌మెడల్ అందిస్తారు. కాగా, హెల్త్ యూనివర్సిటీ పరీక్షా ఫలితాల్లో డీఎం న్యూరాలజీలో వరుసగా మూడు సార్లు గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులే టాపర్లుగా నిలిచి చరిత్ర సృష్టించారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో నాలుగు పీజీ సీట్లు ఉన్నాయి. పరీక్ష రాసిన నలుగురిలో ముగ్గురు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు యూనివర్సిటీ స్థాయిలో సాధించి రికార్డు సృష్టించారు. గుంటూరు జీజీహెచ్‌లో న్యూరాలజీ అభ్యసించిన డాక్టర్ లలిత, డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద హెల్త్ యూనివర్సిటీ టాపర్లుగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా, మూడో సారి డాక్టర్ పి.కార్తిక్‌రెడ్డి గోల్డ్ మెడల్ అందుకోనున్నారు. కడపకు చెందిన డాక్టర్ పప్పిరెడ్డి కార్తిక్ రెడ్డి కర్నూలులో ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యనభ్యసించి సూపర్‌స్పెషాలిటీ పీజీ న్యూరాలజీ గుంటూరులో చేరాడు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన డాక్టర్ కార్తిక్‌రెడ్డిని, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన డాక్టర్ అజ్మా, డాక్టర్ కాంతిమాలను గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగార్జున కొండ వెంకటసుందరాచారి అభినందించారు. ఆయన గైడెన్స్ వల్లే తాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించగలిగానని డాక్టర్ కార్తిక్‌రెడ్డి తెలిపారు.

24 నుంచి ఉపాధ్యాయులకు ప్రత్యేక వైకల్య నిర్ధారణ శిబిరం

గుంటూరుఎడ్యుకేషన్: బదిలీల్లో భాగంగా శారీరక వైకల్య కేటగిరీలో ప్రాధాన్యత పాయింట్లు పొందగోరు అన్ని కేటగిరీలకు చెందిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు ఈనెల 24,25,26వ తేదీల్లో గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతూ ఆధారపడిన కుటుంబ సభ్యులు గలవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ శస్త్రచికిత్సలు చేయించుకున్న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు వైద్య శిబిరానికి హాజరుకావాలని ఆమె సూచించారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, అవయవ మార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి, స్పైనల్ సర్జరీ, మానసికంగా బాధపడుతున్న భార్య, భర్త, పిల్లలు, వైద్యం పొందుతున్న వారితో పాటు జువైనల్ డయాబెటిస్, థలసేమియా, హీమోఫీలియా, మస్కులర్ డిస్ట్రోఫీతో బాధపడుతున్న, ఆధారిత పిల్లలు, వైద్యం పొందుతున్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆమె సూచించారు.